కర్ణేంద్రియాలు పని మానివేశాయి. చూపు క్షీణించింది. నాలుక మొద్దుబారింది. మెదడు ముద్దగా మారింది. రక్తనాళాలు స్థంభించి గుండె కరడుకట్టి, కఠినమైన శిలాకృతి దాల్చి వజ్రమైంది.

కామయ్య మేస్టారి ఆశలు, ఆనందాలు, సుఖ దుఃఖాలు, మంచి చెడుగులు, బ్రతుకు విలువలు, ఆకర్షణలు, సంఘర్షణలు అన్నీ పూర్ణాంకం నుండి శూన్యాంకాని కొచ్చాయి.

★ ★ ★

మరునాడు జిల్లా పోలీసు అధికారి వచ్చాడు - 'దేవాలయోద్ధరణ' తాలూకు దొమ్మీని తన వారెలా నిరోధించారో తెలుసుకోవటానికి. దారిలో నారాయణరావు గారి కుమారుని హత్యా ప్రయత్నం తెలిసింది.

వస్తూనే, "అతను చచ్చాడా?" అని ప్రశ్నించారు.

సెల్యూట్ చేసిన ఇన్స్పెక్టరు, "అవును సార్" అన్నాడు.

"కారణం?"

"గుండె పగిలి."

"నాన్సెన్సు, హత్యా ప్రయత్నం అని విన్నాను" అన్నారు జిల్లా అధికారి.

"మొదటిది హత్యా ప్రయత్నం. ఆస్పత్రిలో అతను కోలుకొంటున్నాడు - రెండోది కామయ్య మేస్టారు. మనకు కావలసిన సాక్షి. గుండె పగిలి చనిపోయాడు" విన్నవించాడు ఇన్స్పెక్టరు.

★ ★ ★

కథలోనైనా- కావ్యంలోనైనా కథానాయకుడు కథాంతంలో విజయం సాధించాలి. మరణించకూడదు....

ఎవరేమన్నా ఈ కథకు కథా నాయకుడు కామయ్య మేస్టారే. ●

## కథ వెనుక కథ :

*మాచర్లలో ఉద్యోగిగా వున్న (1960) నాటి స్థితి గతుల వృత్తాంతమిది. అక్కడికి దగ్గరలో వున్న పల్లెలో టీచరుగా పని చేస్తోన్న "శ్రీ రాజనాల సత్యనారాయణ" గారు*

